# నవ్వా - లవ్వా



పోకాటి బాబు

కృష్ణగారికి
నమస్కారాలు

మీరు పత్రికల్లో వ్రాసిన 'ఆడమ్మాయి' కథ బోల్డు హాస్యంగా వుంది. చాలాసేపు నవ్వుకున్నాను. లవ్వుకన్నా నవ్వే గొప్పదని వ్రాసారు. కథ బాగానే వుంది. లవ్వు చేయడం చేతకానివాళ్ళుకూడ నవ్వగలరు. నవ్వడం చేతకానివాళ్ళుమటుకు లవ్వు చేయలేరని ఖచ్చితంగా చెప్పగలను. (అనుభవం మనుకోగలరు. నా అభిప్రాయము మాత్రమే.)

ఎప్పుడూ మీ కలంనుంచి నవ్వుకథలేగాని లవ్వు కథలు రావా!? మీ నవ్వు కథలు నాకు చాలా యిష్టం. అంతకన్నా మీ కలంనుంచి లవ్వుకథలు వస్తే ఆనందిస్తాను. ఈసారి లవ్వు కథకే ప్రాముఖ్యతనిస్తూ ఒక కథ రాయండి. సంతోషిస్తాను.

మీ
అభిమాన పాఠకురాలు
రాధ
విశాఖ-ఒకటి
నవంబర్—రెండు

రాధగారికి
నమస్తే

అభిమానంతో వ్రాసిన లెటరు అందినది. నా కథపై చూపిన విమర్శలాంటి చిన్న అభిప్రాయానికి పెద్దగా కృతజ్ఞతలు. నేనింతవరకు నవ్వు కథలే రాసాను. జీవితంలో ప్రతి ఒక్కరు నవ్వుతూ సరదాగా గడపాలనే అభిప్రాయం నాది. ఇకపోతే మీకు లవ్వు కథలంటే యిష్టం. అటువంటి కథలు వ్రాయమన్నారు. మీరిచ్చే ప్రోత్సాహమే నాకు ఉత్సాహాన్నిస్తుంది.

'ప్రతిఒక్కరు జీవితంలో తప్పక ప్రేమించాలని' ఏదో సినిడైలాగు నాకింకా గుర్తుంది. తప్పకుండా లవ్వుకథ రాస్తాను. వ్రాసి మీకు పంపుతాను. ఆ కథపై మీ అభిప్రాయం తెలియజేయండి.

యింతకీ మీరు ఏమి చేస్తున్నారో తెలియచేయలేదు.

మీరు అభిమానించిన రచయిత
కృష్ణ.
హైదరాబాద్-2
11—11—68

# నవ్వా-లవ్వా

శ్రీ కృష్ణగార్కి
నమస్కారాలు

మీ కవరు చేరింది. సంతోషించాను. రచయితలకు లెటర్స్‌రాస్తే జవాబులివ్వరని, చాలాగర్వంగా వుంటారనే, ఉద్దేశ్యం చాలా రోజులనుండి నాటుకు పోయింది. నేనను కున్నవన్నీ వచ్చి అసత్యాలని కొద్ది ఆలస్యంగా తెల్సుకున్నాను. మీవద్దనుంచి ప్రత్యుత్తరములు రావటం నాకు చాలా ఆనందంగా వుంది.

యిక్కడ నేను బి. ఎస్.సి చదువు కున్నాను. ఎంత చదివినా యింటిదగ్గర హెయ్యి ఊదుకోవటమే గదండీ (అంటే వంటచేయటం అర్థం. ఈమధ్య పత్రికల్లో కార్టూనులు చూస్తూంటే వంట హెవ్యాగ్రి పురుషుల చేతుల్లోకి వచ్చే ట్టుంది.) మీ లవ్వు కథ ఎంతవరకు వచ్చింది.

యింతకీ మీరేం చేస్తున్నారో తెలియ కేయకపోవటం చాలా ఆశ్చర్యంగా వుంది.

మీ లెటరుకోసం
రాధ.
విశాఖ—1
10—12—68

డియర్ రాధ

మీరు ఎప్పుడో రాసిన కవరు చాలా రోజుల క్రిందటే అందింది. వూళ్ళో లేక పోవటం మూలంగా ఆలశ్యంగా రిప్లయి యిస్తున్నాను. ఆలశ్యానికి సారీ చెప్పినా సరే నాకు సారోగానే వుంటుంది.

మీరు లవ్వుకథ రాయమని రాసారు. నాకు నవ్వు. మీకు లవ్వు యిష్టం. ఈవాళ లవ్వో — నవ్వో తేల్చుకోవాలి.

'లవ్వు గుడ్డిది' అన్నారు లవ్వు చేయని వాళ్ళు.

'నవ్వు నాలుగు విధాల చేటు' అన్నారు నవ్వలేని వాళ్ళు. యిలా వాటిపై చాలా అభిప్రాయాలున్నాయి. ఈ కథ చదివి మీ అభిప్రాయం రాయండి.

'నవ్వా — లవ్వా' అనే విషయంపై దేవలోకంలో ఒకసారి పెద్ద చర్చ జరిగింది. అని మా తాత చెప్పేవాడు. నా కథలు అన్నీ తాతయ్య కథలు అనుకునేరు. అలా అనుకుంటే మీరు పెద్దపొరపాటు చేసినట్లే. గాంధీతాత మొదట యేకుపట్టి దారం తీయటం మొదలుపెట్టాడు. చాలామందికి అది నవ్వులాటగానే వుండేది, ముఖ్యంగా తెల్లవాళ్ళకి. చివరికి సదరు ఏకుమేకై కూర్చుంది. అలాగే తాతయ్య కథలు ఒక నాటికి బహుమతి కథలై కూర్చుంటాయి. యిక దేవలోకానికి వద్దాం...

దేవేంద్రుడు సభలో లవ్వుగొప్పదా? నవ్వుగొప్పదా ?— అని అడిగాడు. రంభ పార్టీవారు 'లవ్వుగొప్పది' అన్నారు, నవ్వు గొప్పదని చెప్పారు నారదపార్టీవారు.

దేవేంద్రుడెలా ? అన్నాడు రంభవైపు చూస్తూ—

—రంభ చెప్పినకథ—

విశ్వామిత్రుడు అడవులకుపోయి ఘోరంగా తపస్సు చేయసాగాడు, యిలా మరి కొన్నాళ్లు ఘోరంగా తపస్సుచేస్తే సర్వలోకాలు అతనికి లొంగి వుండేవి. దేవేంద్రుడు చాలా భయపడ్డాడు. దేవేంద్రుడు మొదలైన పెద్దలు విశ్వామిత్రుని తపస్సు భంగపరచాలని ఆలోచించారు. ఆలోచించి విశ్వామిత్రుని దగ్గరకు మేనకను పంపేరు. విశ్వామిత్రుడు మేనకను చూసేడు. సరదాపడి ప్రేమించాడు. అన్నిలోకాలు పోయాయి. ఒక్క ప్రేమలోకం తప్ప. లవ్వాడకుండా బుద్ధిగా తపస్సు చేసివుంటే సర్వలోకాలు అతని వశమైపోయేవి.

ఆనాడుగాని ఈ లవ్వు అనబడే రెండక్షరాలు లేకపోతే మన దేవేంద్రునిపని గోవిందగా అంటూ ఓరగా దేవేంద్రుని చూస్తూ పమిటసర్దుకుంది.

నారదుడు పెద్దగా నవ్వేడు. రంభ మూతి ముడుచుకుంది:

నవ్వుకి కారణం అడిగేడు దేవేంద్రుడు,

'చెప్తాను. రంభ ఎప్పుడో జరిగిన కథచెప్పి లవ్వు గొప్పదంది. నేను అమ్మమ్మ కథలు చెప్పను. ప్రస్తుతం జరుగుతున్న కథ చూపెట్టదలచాను' అంటూ అందర్నీ భూలోకానికి తీసుకువచ్చేడు.

ఆ కనబడే యిల్లు చూడండి. అందులో యిద్దరు కాలేజీ అబ్బాయిలున్నారు. వాళ్ళు నవ్వు గొప్పదని నిరూపిస్తారు.

అది విశాలంగా లేని విశాఖపట్నం. ఆ పట్నంలో యిరుకుగా వున్న వెంగళావు పేటలో ఒకరూము, అందులో యిద్దరు అబ్బాయిలు. కాలేజీలో చదువుకుంటున్నారు. ఆనందరావు అందమైనవాడు. సుందరం సుందరంగా లేకపోయినా మాడ డానికి బాగానే వుంటాడు. సుందరానికి లవ్వు, ఆనందరావుకు నవ్వు యిష్టం. యిద్దరికి కథలు రాయడం సరదా. సుందరం కథలన్నీ ప్రేమతో నిండి వుండేవి. ఆనందరావు కథలన్నీ జోకులతో వుండేవి.

ఆవేళ ఆదివారం.

కాలేజీకి శలవు.

నవ్వుకథ రాయాలనుకున్నాడు ఆనందరావు. ఆ కథలో ప్రేమలేఖతో మొదలు పెట్టాలి. లవ్వుకథలు రాసే సుందరాన్ని పిలిచి—'ఒక లవ్వులెటర్ రాసిపెట్టరా' అన్నాడు. సుందరం బోల్డు ఆశ్చర్యపోయేడు. ఆనందరావు లవ్వుకి చాలా దూరంలో వుంటాడు. ఎప్పుడు ఆంజనేయ దండకం, వివేకానందకథలు చదివే ఆనందరావు అమ్మాయిని ప్రేమించడం అమ్మాయికి లవ్వులెటర్స్‌రాయడం అంతా ఆశ్చర్యంగా వుంది.

'ఎందుకురా ఆశ్చర్యపోతావు. నాకథలో మొదట హీరోయిన్‌కు లవ్ లెటర్ హీరో పోస్టుచెయ్యాలి. యిక ఆశ్చర్యం తగ్గించి లెటర్ వ్రాయి.'

'అదా సంగతి. కథలో లవ్‌లెటర్ ఎలా వుండాలి. సందర్భం కావాలి.'

'శ్రద్ధగావిను. కాలేజీలో అందమైన సుందరి వుంటుంది. ఆ అమ్మాయిపేరు 'ప్రేమ'. ప్రేమకి ప్రేమమీద నమ్మకం జాస్తి. అదే కాలేజీలో 'శేఖర్' అనే అబ్బాయి చదువుతున్నాడు. శేఖర్ ప్రేమని గాఢంగా ప్రేమిస్తున్నాడు. ప్రేమకు శేఖర్‌పై ప్రేమ లేదు. ప్రేమ తన క్లాస్‌మేట్ అయిన రవిని ప్రేమిస్తోంది. ఈ సంగతి శేఖరుకు తెలుస్తుంది. యిప్పుడు శేఖర్ ఒక లవ్వు లెటర్ రాయాలి?'

'అయితే రాసుకో'—అంటూ సుందరం చెప్పటం మొదలు పెట్టాడు.

'ప్రియమైన ప్రేమకి రవి రాసేది...'

'ఆగరా బాబూ. లవ్వు లెటర్ శేఖర్‌కు రాయాలి.'

'తెలుసు ప్రేమలేఖలు చాలా రకాలుగా వుంటాయి. చెప్పడం అనుకున్నావా!' అంటూ సుందరం మలభంగ నవ్వేశాడు.

'నవ్వులుకూడ చాలా రకాలుగా వుం

టాయి. ముళ్ళపూడి ఇంగ్లీషులో నవ్వుతాడు. పానుగంటి తెలుగులో నవ్వుతాడు. నువ్వు అన్ని భాషలలోను వంకరగా నవ్వుతావు. అల్లరి చేయక పూర్తిగా రాయి ఎంతవరకు వచ్చింది;'

'ప్రియమైన ప్రేమకు ప్రేమతో రవి రాసేది...'

నీవంటే నాకు చాల యిది. నీవు చాలా అందంగా ముద్దుగా వుంటావు. నీకు లవ్వుంది. నవ్వుంది. నాకు నవ్వుతూ లవ్వాడడమంటే చాలా యిష్టం. నీవు నన్ను ప్రేమిస్తున్నావని తెలియజేయటానికి వచ్చే మంగళవారం కాలేజీకి వచ్చేటప్పుడు రెండు జడలు వేసుకో. నాకిష్టమైన మల్లెపూలు ఒక జడలో పెట్టుకో.

మరో సంగతి

ఒకే కాలికి చెప్పు వేసుకురా! రెండవ కాలికి వేసుకోకు. అలా వేసుకునివస్తే నీ స్నేహితులు నవ్వుతారని అనుకోకు. నీ స్నేహితులు విరగబడి నవ్వుతూ మరో జోడు వేసుకోవడం మరిచిపోయావా, అలా అడిగేవారికోసం నీకో మంచికథలాంటి జవాబు చెప్పుతాను.

యింటి దగ్గర్నుంచి వస్తూవుంటే ఒక రోమియో ఏమండి నేను మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. మీరు లేకపోతే బతకలేను అంటూ ముద్దు పెట్టుకోడానికి దగ్గరకువచ్చేడు. భలే కోపమొచ్చింది. భయపడ్డాను. చెప్పుతీసి పైకి విసిరేను. వాడు నవ్వుతూ...పోనీలెండి. మీరు నన్ను ప్రేమించకపోయినా ఫరవాలేదు. ఈ చెప్పు మన ప్రేమకి చిహ్నంగా ఉంచుకుంటాము. అంటూ పట్టుకుని చక్కా పోయాడు.

భరతుడు శ్రీరాముని పాదుకని తీసుకొని వెళ్ళినట్టు.

చాలా రాసేను.

యికవుంటా...

మంగళవారం

నీకోసం ఎదురుచూస్తూ

నీ


రవి

'యిల్లా రాసేవంటే ప్రేమకి రవిపైన కోపమొస్తుంది. లవ్వాడడం మానేస్తుంది. అప్పుడు శేఖర్ చక్కగా సరదాగా లవ్వు లెటర్స్ రాస్తాడు. ప్రేమ సంతోషంతో శేఖర్‌ని ప్రేమిస్తుంది. ఎలావుంది?' అంటూ బ్రహ్మాండమైన సలహా యిచ్చానని పొంగిపోయాడు.

'బాగుంది. కథ అడ్డం తిరుగుతుంది! అప్పుడు ప్రేమ ఏమని రాస్తుందో తెలుసా?'

'తెలుసు'

'అయితే చెప్పు'




ప్రియమైన రవిగారికి ప్రేమ రాసేది.

మీరు నన్ను ప్రేమిస్తున్నందుకు చాలా ఆనందంగా వుంది. మీరు లవ్ లెటర్స్ కూడా చాలా సరదాగా రాసారు. 'చెప్పుకథ' బాగుంది. నవ్వుకున్నాను మీ చమత్కారానికి. నేను మంగళవారం వరకు ఆగలేను. రేపు ఆదివారం సాయంత్రం నాలుగ్గంటలకు రామక్రిష్ణా బీచ్‌లో కల్సుకుందాం. బోల్డు సంగతులు సరదాగా మాట్లాడుకుందాం

ఆదివారం మీకోసం

మీ

ప్రేమ.

తా|| క||: మీ కిష్టమైన మల్లెపూలు పెట్టుకొని వస్తా!

ఆనందరావు బిగ్గరగా నవ్వాడు.

'అడ్డం తిరిగినా కథ యిప్పుడు మలుపు తిరిగింది. బాగుంది. నాకథంతా మారిపోయింది. నీకు లవ్ లెటర్స్ రాయటం చేతనవును. అది ఎక్కడ రాయాలో తెలియదు. నేను అడిగిన దానికి సరియైన జవాబు చెప్పాలి. నీ రెండు లెటర్సు చదివితే తప్పక నవ్వు వస్తుంది. అని ఒప్పుకుంటావా?' నవ్వుతూ అడిగాడు ఆనందరావు.

'ఒప్పుకుంటాను.'

'లవ్వులోకూడ నవ్వుందని లవ్వు చేసి నవ్వుల పాలయినవారు చాలామంది వున్నారని నేను నిరూపిస్తాను. తక్కిన కథ నేను చెప్తాను. విను' అంటూ చెప్పటం మొదలు పెట్టాడు ఆనందరావు.

ప్రేమ రాసిన ప్రేమలేఖ రవికి అందలేదు. శేఖర్ చేతిలో పడింది. శేఖర్ చేతికి చిక్కటానికి కారణం లేకపోలేదు, రవి. శేఖర్ రూంమేట్స్. రవి శ్రద్ధగ చదివే బుద్ధిమంతుడు.

ఆదివారం శేఖర్ నీటుగా తయారై రామక్రిష్ణాబీచ్‌కు తయారయ్యాడు. అదే టైంకు ప్రేమకూడ బీచ్‌కు వచ్చింది.

'హల్లో! ప్రేమ మీరు రాసిన లెటర్ అందింది. మీరు శేఖర్ బదులు రవి అని రాస్తున్నారు. ఇకనుంచి సరిగ్గా రాయండి. రండి. అలా కూర్చుందాం' నవ్వుతూ శేఖర్ ప్రేమదగ్గరకు రాబోయాడు.

జరిగింది గ్రహించింది ప్రేమ. చిర్రగా వున్న ప్రేమ ముఖం మరీ చిర్రగా అయింది.

'ఛీ! నీకు బుద్ధిలేదు. ఇంకొకది

పేరుతో ప్రేమ లేఖలు రాస్తావా? నీ చదువు. సంస్కారం. ఏమయింది' గట్టిగా సినీడైలాగుల్లా తిట్టడం మొదలుపెట్టింది.

ఎన్నితిట్టినా శేఖర్ బాధపడ లేదు తెల్లగావున్న శేఖర్ ముఖం యింకా తెల్ల బడలేదు. సిగ్గుపడకుండా నవ్వుతూ —

'ప్రేమ! ప్రేమకు చదువు, సంస్కారం అక్కర్లేదు. చదువులేనివాడుకూడా ప్రేమి స్తాడు.

ఎం. ఏ.లు, పి. హెచ్ డీలు వున్నవాళ్ళు ప్రేమిస్తారనుకునేవు. వాళ్ళకి చదువుతోనే కాలం గడిచిపోతుంది. ఇక ప్రేమకు తావేది. ఇకపోతే సంస్కారమున్నవాడు చూసిన ప్రతీ అమ్మాయిని సోదరిలా చూసుకోవాలి. ఎందుకంటే నేను చాలా సంస్కారం కలవాడిని. సంస్కారం గల పెద్దమనిషికి ప్రేమించాలని వుంటుంది. కాని సంస్కారం అడ్డు వస్తుంది.'

ఈసారి ప్రేమకు పట్టరాని కోప మొచ్చింది. 'మిష్టర్! సరిగ్గా మాట్లాడు. నోటికి వచ్చినట్లు కూయకు' అంది రోషంగా.

'ప్రేమించని ప్రతివాడు సరిగ్గా మాట్లాడలేడు. అది ప్రేమలోని నగ్నసత్యం'

'షటప్' అంటూ ఎడమకాలి చెప్పుతీసి చెప్పిన మీదకు విసరబోయి ఆగి,

'నీవు రాసినకథ నాకింకా గుర్తుంది. అందుకే చెప్పు విసరను' చెప్పుతోకొట్టింది. అక్కడ వునవాళ్లంతా అసలుసంగతి తెలుసుకుని నవ్వుకున్నారు.

'ప్రేమ గుడ్డిది. నవ్వుగొప్పది' అంటూ పరుగుతీశాడు శేఖర్. నారదవేషంలోవున్న దేవేంద్రుడు—నారదా! రంభ జరిగినకథ చెప్పి, 'నవ్వు గొప్పదంది.' నీవు 'ప్రేమ గుడ్డిది' అని కథద్వారా నిరూపించావు. కాని అది నిజంగా జరుగలేదుగా!' అన్నాడు.

నారదుడు నవ్వి 'దేవేంద్రా! ప్రస్తుతం పత్రికలలో వచ్చేకథలన్నీ నిజజీవితంలో జరిగే కథలే! యిద్దరు మిత్రులు వ్రాసిన 'గొలుసుకథ' ప్రస్తుత సమాజానికి చాలా దగ్గరలోవుంది.'

'నవ్వుగొప్పది, నవ్వుగొప్పది. రెండూ కలిస్తే—అంటే 'నవ్వులపాలైన నవ్వు' మటుకు ఆరోగ్యానికి, వొంటికి మంచిది కాదు' అంటూ దేవేంద్రుడు సభ చాలిం చేడు.—

**వేనీకథలో నవ్వుకే ప్రాధాన్యత యిచ్చేము.**


# పాత తరహా వైద్యాలెందుకు మైక్రోఫైన్ 'ఆస్ప్రో' బాధను ఎంతో త్వరగా తగ్గించేటప్పుడు.




ఆయింట్‌మెంటులు, పూతలు, మామూలు బిళ్లలూ–ఇవన్నీ పాత తరహావి. అవి పని చెయ్యటానికి ఎంతో కాలం తీసుకుంటాయి. అంతకాలమూ మీరు బాధను అనుభ వించాల్సివస్తుంది. ఏమాత్రం తలనొప్పి గాని, ఇతర నొప్పులు గాని కనిపించగానే మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' తీసుకుంటాను. అంతే! నొప్పి చిటికెలో తగ్గిపోతుంది.

నొప్పిని తగ్గించేటందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' శాస్త్రీయమైన అధునిక నివారణ. 'మైక్రోఫైన్డ్' అంటే ప్రతి 'ఆస్ప్రో' బిళ్ల 150 మిలియన్ల అతి సూక్ష్మమైన అణువు లను కలిగి ఉండటం. ఈ అణువులు అతి త్వరగా కరుగుతాయి, ఇముడుతాయి. అంత త్వరగానూ నొప్పిని తగ్గిస్తాయి. మీకు సత్వర నివారణ కలిగించేటందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' మామూలు బిళ్లలకంటె రెట్టింపు త్వరగా పనిచేస్తుంది.

అనవసరంగా బాధను అనుభవించకండి–మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను తీసుకోండి.

మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను– నొప్పి • తలనొప్పి • ఫ్లూ • ఒళ్లు నొప్పులు • జలుబు • కీళ్లనొప్పులు • గొంతునొప్పి • పంటినొప్పులకి వాడండి.

మోతాదు: పెద్దవారికి: రెండు బిళ్లలు, అవసరమైతే మళ్లీ వేసు కోండి, పిల్లలకు: ఒక బిళ్ల లేక మీ డాక్టరు సలహాననుసరించి వేసి కొనవలెను.




**నెమ్మదిగా నివారించును** బిళ్లలోని పెద్ద అణువులు నెమ్మదిగా ఇముడుతాయి. నొప్పి తగ్గటానికి చాలాసేపు పడుతుంది. కనుక అంతసేపూ మీరు బాధ పడాల్సి వస్తుంది.

**శీఘ్రముగా నివారించును** బిళ్లలోని చిన్న అణువులు త్వరగా ఇముడుతాయి. బాధా మూలమును త్వరగా చేరు కుంటాయి. కనుక త్వరగా నొప్పిని తగ్గిస్తాయి.



## నొప్పిని *అతిశీఘ్రంగా* తొలగించడానికి 'ఆస్ప్రో' మాత్రమే మైక్రోఫైన్డ్ చేయబడినది.

నికోలస్ తయారీ

A.G.49 (3) TL

మీకు లవ్వయిష్టం కాబట్టి పై కథపై మీ అభిప్రాయం, విమర్శకావాలి? ఏ పత్రికకు పంపమంటారు?


అందమునకు, వర్చస్సునకు

నేషనల్స్
కాశ్మీర్ స్నో

మరియు

టాల్కమ్ పౌడర్

మరియు

లెవండర్
బ్రిలియంటైన్

• మరియు
దిల్ కుష్ అగరుబత్తి




తయారుచేయువారు:
ది నేషనల్ ట్రేడింగ్ కంపెనీ,
(మద్రాస్) మద్రాస్-32


# నవ్వా-లవ్వా

యికపోతే నాసంగతి వ్రాయమన్నారు. యం. ఏ. పాసు అయ్యేను. ఉద్యోగం లేదు కథలు వ్రాస్తూ తాతలు గడించిన ఆస్తిని ఖర్చుచేస్తూ సరదాగా గడుపుతున్నాను.

మరి వుంటా
మీ
కృష్ణ.

డియర్ కృష్ణ

మీరు ప్రేమతో వ్రాసినకవరు అందింది.

లవ్వుకథ సరదాగ వుంది. మీరు లవ్వు కథ చాలా సీరియస్‌గ వ్రాస్తారనుకున్నాను. కాని ఆ నవ్వకథలో లవ్వుకథ కూడా హాస్యంగా వ్రాసేసారు. ఏమయినా కథ బావుంది.

మీకో శుభవార్త వ్రాస్తున్నాను. నేను ఆదివారం మీ వూరు వస్తున్నాను, ఎక్స్‌ప్రెస్‌లో. వీలుంటే కలవండి. మా అక్కయ్య వాళ్ళు విశాఖలో వుంటున్నారు. సమక్షంలో మీ కథపై నా అభిప్రాయం కోకొల్లలు.

స్టేషనుకి వస్తారని ఆశిస్తూ
మీ
రాధ.

హైదరాబాద్‌లో రాధ అనే కలం పేరుతో పత్రికలకి, రచయితలకి 'ఉత్తరాలు' వ్రాయడం మూర్తికి అలవాటు. యిలా చాలామందికి రాసి నవ్వులపాలుచేసే సంఘటనలు లేకపోలేదు. రేపు ఆదివారం విశాఖలో కృష్ణని కలుసుకోవాలి. తనతప్పును ఒప్పుకోవాలనుకున్నాడు మూర్తి. కృష్ణ తనను రాధ అనే అందమైన రెండు జడల అమ్మాయి అనుకుంటూ కలలుకంటూ వుంటాడు. పాపం! బాగా మోసపోయాడు. నన్ను చూడగానే ఆశ్చర్యపోతాడు. ఎప్పుడూ నవ్వు కథలు వ్రాసే కృష్ణ నన్ను గాఢంగా ప్రేమించేస్తున్నాడు. రేపు నవ్వులపాలవుతాడు. యిలా రకరకాలుగా ఆలోచిస్తూ విశాఖవైపు పోతున్న రైలులో ప్రయాణం చేస్తున్నాడు మూర్తి.

'సుజాత కలం పేరు కృష్ణ.' విశాఖలో కథలు వ్రాస్తూ వుంటుంది. చాలామంది అబ్బాయిలు (తలనెరిసిన వాళ్ళుకూడ) అమ్మాయిల పేర్లతో కథలు వ్రాస్తున్నారని తెలిసి కొంతమందిలా తానుకూడా 'కృష్ణ' అనే కలంపేరు కథలు వ్రాయడం మొదలు పెట్టింది. తనకి లవ్వంటే అసలు పడదు. ఎప్పుడూ నవ్వు కథలే వ్రాస్తూ వుంటుంది.

రాధ తనను అందమైన అబ్బాయి అనుకుంటుంది. సరదాగా తాను లెటర్సు వ్రాస్తూంటే — అవన్నీ లవ్వు లెటర్సుగా భావించింది. యిప్పుడు తనకోసం వస్తుంది. తనకు లవ్వు కథలంటే యిష్టమని వ్రాసింది. తనను చూసి సిగ్గుతో మొగ్గలా ముడుచుకు పోతుంది. ఎప్పుడూ ఎవరిని చూడకుండా లవ్వులు చేయవద్దని చెప్పాలి. ప్రేమ గుడ్డిది అని మరోసారి నిరూపించాలి.

వాల్తేరు స్టేషనువద్ద...

గంట నాలుగున్నర అయింది.

—ఎక్స్‌ప్రెస్ పెద్దగోల చేస్తూ ఆగింది. మూర్తి నెమ్మదిగా దిగేడు. కృష్ణకోసం ఎదురుచూస్తున్నాడు రాధ కలం పేరు గల మూర్తి. సుజాతా రాధ కోసం ప్లాటుఫారమంతా చూసింది. రాధ కనబడలేదు. ఎలా కనబడుతుంది? గుర్తు తెలిస్తేగా!

రైలు చక్కగా పోయింది...

ప్లాటుఫారం చిక్కిపోయింది.

మూర్తి, సుజాత తప్ప ఎవరూ ప్లాటుఫారంమీద లేరు.

మూర్తి ధైర్యంచేసి నెమ్మదిగా సుజాత దగ్గరకు వచ్చి,

'ఏమండీ! ప్రసిద్ధ రచయిత కృష్ణ గారు ఎక్కడ వుంటారో చెప్పగలరా?'

సుజాత గాభరా పడిపోతూ— 'మీరు రాధ పేరు...'

'అవును. ఆ పేరుతో లెటర్సు వ్రాస్తుంటాను. మీరు...'

'కృష్ణ' అనే పేరుతో కథలు వ్రాసే సుజాతను.'

ఇద్దరు ఆశ్చర్యపోయారు.

నవ్వు కథలు ఒకవిధంగా చేటు—

లవ్వు కథలు మరోవిధంగా... ●